

బెల్ట్‌షాపులకు వేలం.!

గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీ) అభివృద్ధి పేరుతో బెల్ట్ షాపుల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ప్రజలను మద్యానికి బానిసలు చేస్తున్నాయి. గ్రామాల అభ్యున్నతికి పాటు పడాల్సిన వీడీసీలు అందుకు మద్యంపై ఆదాయానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. 8లో▸



వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కూడా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.4 /19.1

వాతావరణం

ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతాగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం ఉండదు.

న్యూస్‌రీల్

మైనార్టీ రుణ లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న కమిషనర్, అధికారులు

భైంసాటౌన్: భైంసాలోని మున్సిపల్ కార్యాలయంలో మైనార్టీ రుణ లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించగా, ఎస్‌బీఐ, యూబీఐ, టీజీబీ బ్యాంకు అధికారులతోపాటు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. రుణాల కోసం 1,700 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, వార్డుసభకు 507 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ మేరకు వారి దరఖాస్తులు పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ధర్మపురికి ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. పెద్దలకు రూ.180, పిల్లలకు రూ.100 చార్జీలు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ జీవిత చరిత్రపై నృత్యరూప ప్రదర్శన

నిర్మల్‌టౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రపై ఈనెల 5న జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో నృత్యరూప ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు తెలిపారు. పట్టణంలోని దళిత సంఘాల కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. దళిత బహుజనుల భవిష్యత్తుకు, మార్గదర్శక కార్యక్రమాలకు సంబంధించిన విషయాలను విశ్లేషణాత్మకంగా ప్రదర్శించడం జరుగుతుందని వివరించారు. ఈ ప్రదర్శనను దళితులే కాకుండా, అందరూ చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేధావులు, దళిత అభిమానులు, సంఘ శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు వెల్మాల ప్రభాకర్, డి.రాములు, బొడ్డు లక్ష్మణ్, మెట్టు గంగాధర్, దేవర రాఘవేందర్, బేర పరమేశ్, రోహిదాస్, లక్ష్మి, లస్మన్న, దిగంబర్ పాల్గొన్నారు.

పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

- పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి హరిత



మాట్లాడుతున్న హరిత

భైంసారూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి హరిత అన్నారు. మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్యులను రోడ్డున పడేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతూ ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్నారన్నారు. వంట గ్యాస్ ధర రూ.50, కమర్షియల్ సిలిండర్ ధర రూ.350కి పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో స్వప్న, జ్యోతి, సాగర, లక్ష్మి, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కరువు



లింబా(కే)లో నినాదాలు చేస్తున్న మహిళలు

కుంటాల: స్వాతంత్రం వచ్చి ఏళ్ల గడుస్తున్నా మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించడంలో విఫలమవుతూనే ఉన్నాయని ప్రగతిశీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మహిళల హక్కులపై మండలంలోని లింబా(కె) గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 2021 కంటే 2022లో దేశవ్యాప్తంగా మహిళలపై 30% దాడులు పెరిగాయని తెలిపారు. 38,800 ఫిర్యాదులు అందగా ఇందులో 158 యూపీ నుంచి యాసిడ్ దాడులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మహిళలపై దాడులు ఆపాలని డిమాండ్ చేశా రు. సదస్సులో కె.రాజన్న, బక్కన్న, రామలక్ష్మణ్, గఫూర్, రవూఫ్‌ఖాన్, లావణ్య, అమృత, సరస్వతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

పోరుయాత్ర షురూ..



కార్నర్ మీటింగ్‌కు తరలివచ్చిన ప్రజలు

- భైంసా నుంచి ప్రారంభమైన కాంగ్రెస్ పాదయాత్ర
- తరలి వచ్చిన భట్టి, ఉత్తమ్, దామోదర
- రేవంత్‌రెడ్డి ప్రస్తావన లేకుండా కార్యక్రమం



కార్నర్ మీటింగ్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్/భైంసా/భైంసాటౌన్: భైంసా మరోమారు రాజకీయ యాత్రకు వేదికైంది. బీజేపీ ఐదో విడత ప్రజాసంగ్రామ యాత్రను ప్రారంభించగా, తాజాగా హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ఉమ్మడి ఆదిలాబాద్ తెలంగాణ పోరుయాత్రను ఇక్కడి నుంచే మొదలుపెట్టింది. పార్టీలోని సీనియర్లంతా ఒకే వేదికపైకి వచ్చారు. భైంసాలో శుక్రవారం సాయంత్రం ప్రారంభించిన తెలంగాణ పోరుయాత్రతోపాటు, రాత్రి కుభీర్ చౌరస్తాలో చేపట్టిన కార్నర్ మీటింగ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ ఎన్నికల ప్రణాళిక కమిటీ అధ్యక్షుడు దామోదర రాజనర్సింహతోపాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొనడం గమనార్హం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉప్పునిప్పుగా ఉన్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్ రావు కలిసి ఒకే వేదికను పంచుకోవడం విశేషం. కార్యక్రమం మొత్తం ఎక్కడ కూడా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేరు ప్రస్తావించకుండా సీనియర్ నేతలంతా ప్రసంగించడం చర్చనీయాంశమైంది.

బలగం లేకున్నా భైంసా నుంచే..

కాంగ్రెస్ పార్టీకి ముధోల్ నియోజకవర్గంలో ప్రస్తుతం బలమైన నాయకుడు క్షేత్రస్థాయిలో సరిపడా బలగం లేకున్నా ఇక్కడి నుంచే తెలంగాణ పోరుయాత్ర చేపట్టారు. ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అంతా తానై కార్యక్రమాన్ని భైంసా నుంచే ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రామారావ్‌పటేల్ రెండునెలల క్రితం ఇదే పట్టణంలో ప్రారంభించిన ప్రజాసంగ్రామ యాత్ర వేదికపై బీజేపీలో చేరారు. ఆయన వెంట ముధోల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో కార్యకర్తలు కాషాయదళంలో చేరారు. ప్రస్తుతం సీనియర్ నేతగా సింధే ఆనంద్‌రావు పటేల్ మాత్రమే పెద్దదిక్కుగా నిలిచారు. ఇలాంటి పరిస్థితుల్లో మహేశ్వర్‌రెడ్డి భైంసా నుంచే పోరుయాత్రను ప్రారంభించడం, ఈ యాత్రకు సీనియర్లందరూ తరలిరావడం గమనార్హం. ఇక్కడ మిగిలిన పార్టీ కేడర్, నాయకుల్లో ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్‌పై నమ్మకాన్ని పెంచేందుకే భైంసాలో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి.

ఎమ్మెల్యే లక్ష్యంగా..

ఓ వైపు గడ్డెన్నను కొనియాడుతూనే ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నేతలు విరుచుకుపడ్డారు. ఒకరి తరువాత ఒకరు చేసిన ప్రసంగాల్లో విఠల్‌రెడ్డిని నమ్మకద్రోహిగా పేర్కొన్నారు. సీనియర్ నేత కోదండరెడ్డి సైతం గడ్డెన్నతో పనిచేసిన జ్ఞాపకాలను పంచుకున్నారు.

ట్రిపుల్‌ఐటీపై...

పోరుయాత్ర సభలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పేరును, ఆయన అమలు చేసిన పథకాలను పలుమార్లు కాంగ్రెస్ సీనియర్ నేతలు గుర్తు చేశారు. ఆయన ప్రారంభించిన ట్రిపుల్ ఐటీని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అక్కడి విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని నెలలపాటు రోడ్డెక్కినా ఇక్కడి ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీలు కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ కట్టించిన సుద్దవాగు ప్రాజెక్టు భైంసావాసుల తాగునీటి కష్టాలను దూరం చేసిందన్నారు. ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన రిమ్స్ ద్వారా పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోందని తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు అందుతున్న ఎన్నో సంక్షేమ పథకాలు వైఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసినవేనని గుర్తు చేశారు.

కాంగ్రెస్ నోట 'కాక' మాట

భైంసా/భైంసాటౌన్: మేమంతా గాంధేయవాదిగా భావించే గడ్డిగారి గడ్డెన్నగారు ముధోల్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా పనిచేశారని, ఆయన హయాంలోనే ముధోల్ నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి నేతలు గడ్డెన్న కాకను స్మరించుకున్నారు. భైంసాలో శుక్రవారం జరిగిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో టీపీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహతోపాటు పలువురు నేతలు గడ్డెన్న సేవలను కొనియాడారు. గడ్డెన్న అన్నివర్గాలను కలుపుకుని ముధోల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేశారని తెలిపారు.

ఇళ్లకు సోలార్ పవర్



నిర్మల్ జిల్లాలో ఏర్పాటైన సోలార్ యూనిట్

- యూనిట్ల ఏర్పాటుకు మహిళా సంఘాల సభ్యులకు అవకాశం
- స్త్రీనిధి ద్వారా సబ్సిడీ రుణం
- జిల్లాకు 605 యూనిట్లు మంజూరు
- ఈనెల 15 వరకు దరఖాస్తు గడువు

ఖానాపూర్: రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ చార్జీలు పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం, విద్యుత్ ప్రమాదాలు కూడా ఇబ్బందిగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. విద్యుత్ అవసరాలు, విద్యుత్ ఖర్చుల భారం దృష్ట్యా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు సొంతగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని విద్యుత్ ఖర్చును గణనీయంగా తగ్గించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. తద్వారా పర్యావరణ పరిరక్షణకు సైతం ఇది ఎంతగానో తోడ్పడుతోంది. జిల్లాలో 605 సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటిని మండలాల వారీగా స్వయం సహాయక సంఘ సభ్యులకు అందజేయనున్నారు. సోలార్ కరెంట్ వినియోగంపై స్వశక్తి సంఘాల సభ్యులను ప్రోత్సహించే దిశగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

మండలాల వారీగా మంజూరైన యూనిట్లు..

జిల్లాలో మొత్తం 605 యూనిట్లను 18 మండలాలకు కేటాయించారు. బాసర 35, భైంసా 35, దిలావర్‌పూర్ 35, కుభీర్ 35, కుంటాల 35, లక్ష్మణచాంద 35, లోకేశ్వరం 35, మామడ 35, ముధోల్ 35, నర్సాపూర్(జి) 35, నవయుగ పట్టణ సమాఖ్య(నిర్మల్) 35, నిర్మల్ రూరల్ 35, సారంగాపూర్ 35, సోన్ 35, తానూర్ 35, ఖానాపూర్ 10 సోలార్ యూనిట్లు మంజూరు చేయనున్నారు.

ఈనెల15 వరకు అవకాశం..

జిల్లాలో 605 యూనిట్లు మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు 46 యూనిట్లకు లబ్ధిదారులను గుర్తించారు. వాటిలో నుంచి 7 చోట్ల(ఎల్లపెల్లి, కౌట్ల, కామోల్, కుంటాల, కౌట, గుండంపల్లి, కాల్వ) గ్రామాల్లో ఇన్‌స్టాలేషన్ సైతం పూర్తిచేశారు. మార్చి 15 వరకు గడువు ఉండడంతో మిగతా యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయడం, యూనిట్లు ఇన్‌స్టాలేషన్ చేయడంపై అధికారులు దృష్టిసారిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకు నిబంధనలు అడ్డురావడంతో సకాలంలో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు.

ఆన్‌గ్రిడ్ సిస్టంలో సోలార్ విద్యుత్..

గతంలో ఆఫ్‌గ్రిడ్ ద్వారా సోలార్ విద్యుత్ సిస్టంను అందించేవారు. ప్రస్తుతం ఆన్‌గ్రిడ్ పద్ధతిలో అందిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఇటీవల టీఎస్ రెడ్‌కో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతీనెల 200 నుంచి 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను గృహావసరాల కోసం ఉపయోగించే సభ్యులకు సోలార్ యూనిట్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. దీనిపై సంబంధిత అధికారులు స్పష్టమైన అవగాహన కల్పిస్తేనే అమలవుతుంది.

స్త్రీనిధి ద్వారా రుణం..

సోలార్ యూనిట్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై స్వశక్తి సంఘాల మహిళలకు డీఆర్డీఏ ద్వారా స్త్రీనిధి నిధులతో సబ్సిడీ రుణం అందిస్తారు. సబ్సిడీ పోను మిగతా మొత్తాన్ని నెలనెలా కిస్తీల వారీగా చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు. నెలకు 150 నుంచి 250 యూనిట్ల వరకు కరెంట్ వినియోగించే మధ్యతరగతి కుటుంబాలకు 2 కిలోవాట్ల యూనిట్ సరిపోతుంది. దీంతో రోజుకు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. పెద్ద కుటుంబాలకు 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ఏర్పాటుచేస్తే రోజుకు 12 యూనిట్ల కరెంట్ ఉత్పత్తి అవుతుంది.

సబ్సిడీ యూనిట్ వివరాలు..

యూనిట్ కెపాసిటీ	2 కిలోవాట్లు	3 కిలోవాట్లు
ప్రాజెక్ట్ విలువ	రూ.1,42,200	రూ.1,92,360
సబ్సిడీ	రూ.39,200	రూ.57,360
దరఖాస్తు రుసుం	రూ.2,360	రూ.3,450
నెట్ మీటర్ చార్జీలు	రూ.2950	రూ.2950
స్త్రీనిధి రుణం	రూ.1,00,000	రూ.1,25,000
సభ్యురాలి వాటా	రూ.3,000	రూ.10,000
నెలవారీ వాయిదా	రూ.2,248	రూ.2,803



ఆన్‌గ్రిడ్ సోలార్ ఎంతో ఉపయోగం

గతంలో మహిళా సంఘాలకు సోలార్ యూనిట్లను ఆఫ్‌గ్రిడ్ పద్ధతిలో మంజూరయ్యేవి. ప్రస్తుతం ఆన్‌గ్రిడ్ సిస్టం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లబ్ధిదారులు అవసరానికంటే ఎక్కువ వచ్చే విద్యుత్‌ను సంబంధిత విద్యుత్ శాఖకు విక్రయించే అవకాశం ఉంటుంది. సోలార్ పద్ధతి ద్వారా విద్యుత్ సంస్థలపై భారం తగ్గుతుంది.

– సరిత, స్త్రీనిధి రీజనల్ మేనేజర్, నిర్మల్

15 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

సోలార్ విద్యుత్ సబ్సిడీ యూనిట్ల కోసం మహిళా సంఘాల సభ్యులు మార్చి 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన అధికారులు, సిబ్బంది సైతం స్త్రీనిధి ద్వారా సబ్సిడీ యూనిట్లపై గ్రామాల వారీగా అవగాహన కల్పించాలి. సోలార్ యూనిట్లను బిగించుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం అవుతాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

'డబుల్' ఎంపికపై అఖిలపక్షం ఆందోళన



రాస్తారోకోలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

- పేదలకు అన్యాయం చేశారని ఆరోపణ
- అనర్హులను తొలగించాలని డిమాండ్

ఖానాపూర్: ఖానాపూర్‌లో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపికపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. శు క్రవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్ట ణ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలో నాయకులు రాస్తారోకో చే శారు. అర్హులైన పేదలకు ఇళ్లు పంపిణీ చేయాలని డి మాండ్ చేశారు. ఒక వర్గానికి చెందిన వారినే ఎమ్మె ల్యే ఎంపిక చేయించారని ఆరోపించారు. ఆ తప్పు ను అధికారులపైకి నెడుతున్నారని విమర్శించారు. అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్లు ఇవ్వాలన్నా రు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హె చ్చరించారు. కార్యక్రమంలో చిన్నం సత్యం, దయానంద్, నాయిని సంతోష్, తోకల బుచ్చన్న, జక్కుల గంగామణి, సిరిగారపు లింగన్న, తోట సత్యం, గంగనర్సయ్య, నిమ్మల రమేశ్, సింహరాజుల ఆనంద్, జహీర్‌అహ్మద్, రుస్తుం, సంద వేణు, సలీంఖాన్, వర్మ, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను తొలగించాలి..

పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీడ్రాను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే రేఖానాయక్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. గురువారం చేసిన ఎంపికలో అనర్హులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. సర్వే నిర్వహణ అసంబద్ధంగా చేశారని తెలిపారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు ఒత్తిళ్లకు లొంగకుండా పూర్తిస్థాయి విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

పేదలకు అన్యాయం..

నిబంధనల మేరకే అర్హులకు ఇళ్లు ఇస్తామనే సాకుతో అనర్హులకు ఇళ్లను కేటాయిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సునారికారి రాజేశ్ ఆరోపించారు. ఖానాపూర్‌లో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. లక్కీడ్రాను రద్దు చేసి పేదలకు ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట గోపి నర్సయ్య, దుర్గం లింగన్న, ప్రసాద్, గంగన్న, పెద్దులు, ఉన్నారు.

అనర్హులుంటే తొలగిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో అధికారుల తప్పిదంతో కొంత మంది అనర్హులకు ఇళ్లు వచ్చాయని, అటువంటి వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ తెలిపారు. పట్టణంలోని ఆమె నివాసంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద వేర్వేరుగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక సమయంలో గ్రామసభల సందర్భంగా అనర్హులపై అభ్యంతరాలు చెప్పకపోవడంతోనే వారి పేర్లు జాబితాలోకి వచ్చాయన్నారు. మంచిర్యాలలో ప్రభుత్వ స్థలం లేని కారణంగా మంజూరైన 200 ఇళ్లను ఖానాపూర్‌లో నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిగతా వారందరికీ నూతనంగా ఇళ్లు నిర్మించి పంపిణీ చేస్తామన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో అంకం రాజేందర్, రామునాయక్, ఖలీల్, పరిమి సురేశ్, గౌరై గంగాధర్, పుప్పాల శంకర్, సంతోష్, ధర్మరాజు, సంజీవ్, రాజగంగన్న, శ్రీనివాస్‌రెడ్డి, బండారి కిశోర్, కా రింగుల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై పునరాలోచించాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

నిర్మల్‌చైన్‌గేట్: ఐసీడీఎస్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన 36 గంటల దీక్ష శుక్రవారం ముగిసింది. మధ్యాహ్నం వరకు దీక్ష చేసిన అంగన్‌వాడీలు అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు. గేటు ముందు బైఠాయించారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ కేంద్రం ఐసీడీఎస్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేదలకు పోషకాహారం దూరం చేయాలని చూస్తోందని విమర్శించారు. నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. రక్తహీనత, శిశు మరణాల రేటు, పోషకాహార లోపాన్ని నిర్మూలించడంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అంగన్‌వాడీల సేవలను గుర్తించినా కేంద్ర ప్రభుత్వ మాత్రం గుర్తించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ద్వారానే ఐసీడీఎస్ కాపాడుకోవచ్చని తెలిపారు.

అంగన్‌వాడీల పోరాటానికి అండగా ఉంటాం...

ఐసీడీఎస్ ద్వారానే పేదలకు పోషకాహారం అందుతుందని ఐసీడీఎస్ రక్షణ కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న పోరాటాలకు అండగా ఉంటామని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్ ప్రజా పంథా), ఐఎఫ్‌టీయూ, ఎస్సీఆర్టీ సంఘాల నేతలు తెలిపారు. అంగన్‌వాడీల దీక్షకు సంఘీభావం తెలిపారు. కనీస వేతనాలు పెంచడంతోపాటు అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చాలని కోరారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎ.రాజమణి, బి.లలిత, జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షురాలు, శైలజ, స్వర్ణలత, భాగ్యలక్ష్మి, సునీత, గంగమణి, డాకురి రాజమణి, దుర్గం వందన తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, చిత్రంలో ఏఎస్పీ

భైంసాటౌన్: ప్రస్తుత కాలంలో ఆకస్మిక గుండెపోటు మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించడంలో భాగంగా సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసక్సియేషన్)పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సూచించారు. భైంసాలోని డాక్టర్స్ అసోసియేషన్ భవన్‌లో భైంసా డాక్టర్స్ అసోసియేషన్, ఐఎంఏ భైంసా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విఠల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ.. కరోనా బారిన పడిన చాలామందికి గుండెపోటు వస్తోందన్నారు. గుండెపోటు మొదటగా వచ్చిన సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారని, ఈ సమయంలో సీపీఆర్ ప్రక్రియతో ఆకస్మిక మరణాలను అరికట్టవచ్చన్నారు. అనంతరం సీపీఆర్‌పై ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై శిక్షణ త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు పేర్లు నమోదు చేసుకోవాలని కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ జాదవ్, డాక్టర్ సూర్యకాంత్, డాక్టర్ కైలాష్, కుమార్ యాదవ్, సీఐ శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.కృష్ణ, వైద్యులు మహేశ్, జవహర్, రజనీకాంత్, ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానం దుకాణాల వేలం ఈనెల 9న నిర్వహించనున్నట్లు ఈవో రవికిషన్ తెలిపారు. ఏడాది కాలపరిమితితో 17 షాపులకు ఆలయం ఆవరణలోనే బహిరంగా వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ప్రతీ షాప్‌కు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

క్లుప్తంగా

ఆర్కే 6 గనిని సందర్శించిన ఆదిలాబాద్ జడ్జి



గనిపై అధికారులతో జడ్జి ప్రమీల జైన్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆదిలాబాద్ సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల జైన్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆర్కే 6 గనిని సందర్శించారు. గనిలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బెల్లంపల్లి రీజియన్ లా ఆఫీసర్ ప్రభందిత, ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి, సేఫ్టీ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, పిట్ ఇంజినీర్ శ్యాంకుమార్, సంక్షేమాధికారి సునీల్‌కుమార్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



గుడుంబా తయారీ సామగ్రితో సిబ్బంది

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ తాండ, అంబారిపేట్ శివారులోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని వంద లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం నిందితులు భూక్యా సుమలత, ఎనగందుల లక్ష్మి, చీమల లక్ష్మిలను ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రవికుమార్, సిబ్బంది రశీద్, నరేందర్, గౌతం, వెంకటేశ్, నిరోషా ఉన్నారు.

రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తు తెలియని రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం తక్కళ్లపల్లికి చెందిన తన్నీరు అశోక్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లిన అశోక్ తక్కళ్లపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతుని కుమారుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ కారణంగానే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక మరేదైనా కారణమా? అనేది దర్యాప్తులో తేలనుందన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

భీమారం(చెన్నూర్): అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. ముందునుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఇసుక టిప్పర్ కిందపడి మృతి చెందిన సంఘటన మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గట్ల సుధాకర్ తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన సూరం మహేశ్ (30) ద్విచక్ర వాహనంపై చెన్నూర్ మండలం ఎలక్కపేటలోని తన అత్తగారింటికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై కుందారం ఎక్స్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టి దాని ముందునుంచి వెళ్తున్న ఇసుక టిప్పర్ కిందపడ్డాడు.

బెల్ట్‌షాపులకు వేలం..!



కౌఠ గ్రామంలోని ఓ బెల్టుషాపు

- వీడీసీ ఆధ్వర్యంలో తతంగం
- గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు
- సంసారాల్లో చిచ్చుపెడుతున్న మద్యం
- గ్రామాభివృద్ధి కమిటీల తీరుపై మహిళల మండిపాటు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బోథ్: గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీ) అభివృద్ధి పేరుతో బెల్ట్‌షాపుల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ప్రజలను మద్యానికి బానిసలు చేస్తున్నాయి. గ్రామాల అభ్యున్నతికి పాటు పడాల్సిన వీడీసీలు అందుకు మద్యంపై ఆదాయానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. బెల్ట్‌షాపులకు ఎలాంటి అనుమతులు లేకున్నా వాటి నిర్వహనకు ఏకంగా బహిరంగంగా టెండర్లు వేసి మరీ గ్రామాల్లో అనధికార లైసెన్స్‌లు జారీ చేయడంపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో బెల్ట్‌షాపు దక్కించుకున్న నిర్వాహకులు ఇష్టానుసారంగా ధరలు పెంచి మద్యం విక్రయిస్తూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ధరలు...

ఇక బెల్టుషాపుల్లో మద్యాన్ని వారికి ఇష్టమైన ధరలకు విక్రయిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కువగా చీప్‌లిక్కర్, బీర్లు మాత్రమే అమ్ముడుపోతాయి. కూలీనాలీ చేసే సామాన్య జనాలు అధికంగా చీప్‌లిక్కర్లకు అలవాటుపడుతుంటారు. మద్యం వ్యసనాన్ని అవకాశంగా తీసుకున్న బెల్టుషాపు నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.15 నుంచి 20 వరకు అదనంగా తీసుకుంటున్నారు. రూ.100కు విక్రయించాల్సిన బాటిల్‌పై రూ.120 వరకు తీసుకుంటున్నారు. బీర్లపై కూడా ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.20 తీసుకుంటున్నారు.

వీడీసీ ద్వారా వేలం..

- మండలంలోని కసుగుట్ట, మర్లపెల్లి, కౌఠ, ధన్నూర్‌తో పాటు అనేక గ్రామాల్లో బెల్టు షాపులకు వేలం వేశారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో దాదాపు 50 వరకు బెల్టు షాపులు ఉన్నాయి.
- గుడిహత్నూర్ మండలంలో సీతాగొంది, తోషం, ముత్నూర్, ఉట్నూర్ ఎక్స్‌రోడ్డుతో పాటు దాదాపు 30గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఉన్నాయి.
- నేరడిగొండ మండలంలో విడిసి ఆధ్వర్యంలో నేరడిగొండ మండల కేంద్రంలో మూడు, వడూర్‌లో ఒకటి, కుమారిలో ఒకటి, తేజాపూర్, కుప్టి, తర్నం కె, బుగ్గారాం, బి సావర్గాంతో పాటు పలు గ్రామాల్లో 30 మొత్తం బెల్టు షాపులు ఉన్నాయి.

కాపురాల్లో మద్యం చిచ్చు

గ్రామాల్లో పలువురు మద్యానికి బానిసై సంసారాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. పనులకు వెళ్లకుండా మద్యం మత్తులో మునిగితేలుతున్నారు. భార్య పని చేస్తే ఆ డబ్బులను తాగుడుకు తగిలేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో చదువుకోవాల్సిన చిన్నారులు సైతం ఇంటి పెద్ద మద్యానికి బానిస కావడంతో పనిబాట పడుతున్నారు. యువత సైతం మద్యానికి అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.

బెల్ట్ షాపులను మూసివేయాలి



చాలా గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉన్నాయి. వీడీసీ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి మరీ బెల్ట్ షాపులకు అనుమతులు ఇస్తున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలి. మద్యం బారీన పడకుండా యువకులను, పేద, మధ్య తరగతి కుటుంబాలను రక్షించాలి.

– సుమేర్ పాషా, బోథ్

ముగిసిన సిరిచెల్మ మల్లన్న జాతర



ఇచ్చోడ: వారం రోజుల పాటు సాగిన సిరిచెల్మ మల్లన్న జాతర శుక్రవారం ముగిసింది. తెలవారుజామున నాలుగు గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం నుంచి భక్తులు నడుస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అవరణలో రథోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

నాడు వెలవెల- నేడు జలకళ




నాడు చెన్న చెరువు నుండి మెదరి చెరువుకు నీళ్లు వెళ్లే కాలువ



నేడు నిండుగా పారుతున్న కాలువ

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామంలోని నాలుగు చెరువుల్లో నీళ్లు లేకపోవడంతో రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశం ఉండడంతో ఫిబ్రవరి 19న సమస్యపై 'సాక్షి'లో 'గొలుసుకట్టు తడారుతోంది' శీర్షికన కథనం ప్రచురించాం. ఈ కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు సరసర్వతి కాలువ ద్వారా వడ్యాల్ వద్ద వాగులోకి నీటిని వదలారు. అక్కడ నుంచి లక్ష్మణచాంద మాటు కాలువ ద్వారా నీటిని ఫిబ్రవరి 19 నుంచి నేటి వరకు వదులుతున్నారు. దీంతో మండలంలోని అతి పెద్ద చెరువుల్లో ఒకటైన చింతల్‌చాంద చెరువు నిండు కుండలా మారింది. గురువారం నుంచి చెన్న చెరువు నుండి నీటిని మెదరి చెరువులోకి వీడీసీ సభ్యులు వదిలారు. మెదరి చెరువు నిండగానే అక్కడ నుంచి కొర్లకుంట, దాని నుంచి ఊర చెరువు నింపుకుంటామని వీడీసీ సభ్యులు తెలిపారు.



నాడు నీళ్లు లేక చెన్న చెరువు



నేడు నిండుకుండలా చెన్న చెరువు

అడవులను సంరక్షించాలి



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో వాహబ్ అహ్మద్

ఇచ్చోడ: అడవుల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని టైగర్ జోన్ అటవీ అధికారి వాహబ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి కేశవపట్నం గ్రామంలో అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అడవుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రెంజ్ అధికారి అమర్ సింగ్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు, కాలిపోయిన సామగ్రి



ఇంద్రవెల్లి: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం మండలంలోని దనోర బి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ వివరాల ప్రకారం.. దనోర (బి) గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతితో పాటు కుటుంబ సభ్యులు ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చేలరేగాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఫ్రిజ్, మంచాలు, కూలర్, టీవీ, బియ్యం, గోధుమలు, జొన్నలు తదితర వస్తువులు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ సంఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టం వివరాలు సేకరించారు. గ్రామస్తులతో కలిసి పంచనామా నిర్వహించి రూ.88వేల600 నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. ఇందులో సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలి



విద్యార్థినితో చదివిస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మధ్యాహ్న భోజనం స్వయంగా రుచి చూస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

లక్ష్మణచాంద: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానంలో నిలవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈవో రవీందర్ రెడ్డితో కలిసి శుక్రవారం సందర్శించారు. మన ఊరు -మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తయ్యాయని, ఉన్నత పాఠశాలలోని పనులు త్వరగా పూర్తిచేసి రంగులు వేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి రుచిచూశారు. మధ్యాహ్న భోజనం తయారీకి నాణ్యమైన సరుకులు ఉపయోగించాలని తెలిపారు. సరుకులను పరిశుభ్రమైన ప్రదేశంలో నిల్వ ఉంచాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులలో సాయంత్రం మెనూ ప్రకారం స్నాక్స్ అందించాలన్నారు. తర్వాత పదో తరగతికి వెళ్లి విషయ అవగాహనను పరిశీలించడానికి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ప్రభుత్వం అందించిన అభ్యసన దీపికలను చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో ఉషారాణి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సాకెరలో ఆకస్మిక పర్యటన



సాకెరలో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

సోన్ మండలం సాకెర గ్రామంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. పల్లెప్రగతి, బృహత్ పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠధామం, నర్సరీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ట్రాలీ, ట్యాంకర్ ఏర్పాటుతో పచ్చదనం పారిశుధ్య నిర్వహణను పగడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కాంపోస్ట్ షెడ్‌లలో సేంద్రియ ఎరువు తాయారు చేయాలని సూచించారు.

శనగ పంట దగ్ధం

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన ముండే ధోండీరాం ఐదెకరాల్లో సాగు చేసిన శనగ పంటను కోత కోసి, కుప్పగా పేర్చి ట్రిల్లర్లో పంట తీసుకోవడానికి వేచి ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శనగపంట కుప్పకు నిప్పు పెట్టడంతో సుమారు 40క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంట పూర్తిగా దగ్ధమైంది. దీంతో రైతు బోరున విలపించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రెండునెలల జైలు

దండేపల్లి(మంచిర్యాల): ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారకుడైన వ్యక్తికి కోర్టు రెండు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. మండలంలోని చింతపల్లికి చెందిన ఎంబడి శంకరయ్య 2017 సెప్టెంబర్ 17న బైక్‌పై వెళ్తూ ఇదే మండలంలోని కొపెల్లికి చెందిన బొక్కనపెల్లి సాయికుమార్‌ను ఢీకొట్టాడు. ఘటనలో సాయికుమార్ మృతి చెందాడు. దీంతో శంకరయ్యపై దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుకాగా రిమాండ్‌కు తరలించారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గతనెల 22న మహారాష్ట్రకు రెండు కార్లల్లో ఎనిమిది మంది కలిసి గంజాయి తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. పరారైన వ్యక్తుల్లో ఒకరు మెడెఠొట్టి మహేష్‌ను శుక్రవారం రాంనగర్‌లో అరెస్టు చేశారు.

ముగిసిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ



ప్రశంసాపత్రం అందుకుంటున్న నరేష్ కుమార్ (గొల్లమాడ పంచాయతీ కార్యదర్శి)



ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజు (తురాటి పంచాయతీ కార్యదర్శి)

నర్సాపూర్(జి): గ్రామాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (టీఎస్ఐఆర్డీ)లో పంచాయతీ కార్యదర్శులకు ఫిబ్రవరి 27 నుంచి మార్చి 3 వరకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ ముగిసింది. జిల్లా నుంచి నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ, తురాటి, దిలావర్‌పూర్ మండలం నుంచి మాడేగాం పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరయ్యారు. నరేశ్‌కుమార్, రాజు, సునీల్‌కుమార్ శిక్షణలో పాల్గొని ఫీల్డ్ విజిట్‌లో భాగంగా శంషాబాద్ మండలం కవాగూడ గ్రామ పంచాయతీని సందర్శించారు. శిక్షణ అనంతరం ప్రశంసా పత్రాలు అందుకున్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న సునీల్ కుమార్ (మాడేగాం పంచాయతీ కార్యదర్శి)

బాధ్యులపై చర్య తీసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: స్థల వివాదంలో దంపతుల ఆత్మహత్యాయత్నానికి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దుకాణాలు మూసి వేశారు. దంపతుల ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు పెద్ద ఎత్తున జిల్లా ఆసుపత్రికి తరలివచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో, డీఎస్పీకి వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి గ్రామంలో విద్యుదాఘాతంతో కొకాటే జనార్ధన్‌కు చెందిన ఇల్లు, కిరాణకొట్టు దగ్ధమైంది. ఎస్సై సయ్యద్ ముజాయిద్ వివరాల ప్రకారం... కొలారి గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీ గాలిదుమారంతో విద్యుత్ తీగలు ఒకదానితో ఒకటి తగిలి నిప్పురవ్వలు జనార్ధన్ ఇంటిపై పడడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

ఒంటరిజీవితం భరించలేక ఆత్మహత్య

భైంసాటౌన్: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఒంటరి జీవితం భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భైంసాలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని ఉమ్రి తాలూకా జిరోల గ్రామానికి చెందిన దొమ్మలవార్ దత్త(31)కు భైంసాకు చెందిన సక్కుబాయితో వివాహమైంది. కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి భార్యతో గొడవ పడుతుండడంతో పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో దత్త శుక్రవారం భైంసాకు చేరుకుని పురుగుల మందు తాగి ఏరియాస్పత్రి వద్దకు వచ్చి పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కుక్క దాడి

భైంసా: బీఆర్ఎస్ బాసర మండల సీనియర్ నాయకుడు విశ్వనాథ్‌పటేల్‌పై గురువారం రాత్రి కుక్క దాడి చేసి గాయపర్చింది. అతడు రాత్రి ఇంటి వద్ద నిల్చొని ఉండగా వెనుక నుంచి ఒకసారిగా దాడిచేసి గాయపరిచింది. కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇటీవల మండల కేంద్రంలో లేగదూడతో పాటు ట్రిపుల్ ఐటీ విద్యార్థులపై కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.